క్లుప్తంగా

చేతిపంపులు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న క్రైస్తవ ప్రతినిధులు

డుంబ్రిగుడ: గసభ పంచాయతీ గిరిజన గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వర్క్ ఆఫ్ క్రైస్ట్ ఇనిస్ట్రీస్ ద్వారా విజ్ ఫర్ ఆసియా, స్వాంత సేవా సంస్థ ఆర్థిక సాయంతో చేతి పంపులను ఏర్పాటు చేశారు. శనివారం ఆ సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రదర్ థామస్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తమ దృష్టికి తీసుకొస్తే బోర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వర్క్ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు సాల్మన్, సుజాత, సర్పంచ్ సునీత, మాజీ సర్పంచ్ సురేష్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో మెర్క్యురీ లైట్ల ఏర్పాటు



లైట్లు వేయిస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు శెట్టి గోపాల్

డుంబ్రిగుడ: అరకు ఎంపీ మాధవి మంజూరు చేసిన రూ.3.40 లక్షలతో స్థానిక కమ్యూనిటీ భవన జంక్షన్ వద్ద, కోల్లాపుట్టు వద్ద సోలార్ మెర్క్యురీ లైట్లను శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శెట్టి గోపాల్ మాట్లాడుతూ వీధి దీపాలు లేని చోట రాత్రుల్లో ఇవి ఎంతో ఉపయోగపడతాయన్నారు. గతంలో ఈ విషయంపై ఎంపీ దృష్టికి తీసుకెళ్లడంతో సోలార్ లైట్లు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో అల్లూరి యూత్ అధ్యక్షుడు సూర్యప్రకాష్, యువత జగదీష్, కామేశ్వరరావు, కిరణ్, సుమన్, గ్రామ వలంటీర్ కళ్యాణ్ పాల్గొన్నారు.

మే 3 నుంచి కామరాజు స్మారక క్రికెట్ టోర్నీ

గంగవరం: మాజీ సర్పంచ్ దివంగత కలుముల కామరాజుదొర స్మారక క్రికెట్ టోర్నమెంటు మే 3వ తేదీ నుంచి గంగవరంలో నిర్వహించనున్నట్లు యువసేన యువకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీలోని 11 మండలాలకు చెందిన జట్లు ఈ నెల 30లోగా ఎంట్రీ ఫీజు రూ.999 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మే 2న డ్రా తీస్తామన్నారు. ఇతర వివరాలకు 9494002399, 9177786252, 9014263363 సంప్రదించాలన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



బాధితులకు సాయం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గంగవరం: రాజవరం అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు సిటిజన్ సేవా సంస్థ డైరెక్టర్ ఎన్. చినబాబు ఆధ్వర్యంలో గోకవరం జీవన్ కాలనీకి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు వంట సామగ్రి, నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పి.పండు, గెద్దం అనిల్, సిహెచ్.శ్రీను, ముప్పిడి భూషణం పాల్గొన్నారు.

యూజేఎఫ్ డైరీ ఆవిష్కరణ

అరకులోయ రూరల్: ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ (యూజేఎఫ్)– 2023 నూతన డైరీని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. స్థానిక పాత్రికేయులు గోవర్ధన్, ప్రశాంత్‌కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చిన్నారావు, పరుశురాం, భాస్కర్‌రావు, ప్రకాష్, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, గురునాయుడు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని వంజరి సచివాలయం పరిధి గొప్పులపాలెం, కృష్ణాపురం, పినకిల్తారి, ములక్కాయపుట్టు గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగన్– జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆమె వివరించారు. పథకాలు పొందుతున్న లబ్ధిదారులను ప్రభుత్వ పాలనపై, పథకాలు అమలు తీరుపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోను, వ్యక్తిగత సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఆయా గ్రామాల్లో 146 గడపలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో 98.04 శాతం నెరవేర్చినట్టు పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను మాత్రమే కాకుండా మరెన్ని హామీలను నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయే అన్నారు. ప్రతి గడపలోనూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసినట్టు వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అన్నారు. ప్రతి సంక్షేమ పథకాన్ని వారి పేరు మీదే అందిస్తున్నారన్నారు. మహిళలతోనే సమాజం అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని తమ ప్రభుత్వం బలంగా నమ్ముతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె. సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు రామకృష్ణ, ఎంపీటీసీ మధు, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, కొర్రా రమని, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సుర్మని మత్స్యకొండంనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ సాగేని లక్ష్మణ్‌పడాల్, యువజన నాయకులు వంజరి శ్రీనివాస్‌నాయుడు, సచివాలయ కన్వీనర్లు కొండపల్లి రాజుప్రవీణ్ సాయి, వంతాల అచ్చిబాబు, వార్డు మెంబర్ జగ్గందొర భీమన్న పాల్గొన్నారు.



గొప్పులపాలెంలో బ్రోచర్ అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రాజవొమ్మంగి: మండలంలోని చెరకుంపాలెం సచివాలయం పరిధిలోని వైకుంఠపురం, బోర్నగూడెం, సంజీవనగరం గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఇంటింట పండుగలా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పేరు పేరున ప్రతి ఒక్కరిని ఆప్యాంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. లబ్ధిదారులు చిరునవ్వుతో తీసుకున్నాం అమ్మా అని బదులిచ్చారు. ఎమ్మెల్యే ధనలక్ష్మి ఓ చిన్నారిని ఎత్తుకుని జగన్ మావయ్య సహాయం నీకూ అందిందా అంటూ అక్కున చేర్చుకున్నారు. చీకటి పడేవరకు ఆమె మూడు గ్రామాల్లోనూ 187 గడపలను సందర్శించారు. గడప గడపకు కార్యక్రమం అని తెలిసిన గ్రామస్తులు తమ ఇళ్ల ముంగిట రంగవల్లులు అద్ది ఎమ్మెల్యేపై పూలు జల్లుతూ ఆహ్వానం పలికారు. హారతులు పట్టి, బొట్టు పెట్టి సందడి చేశారు. యువత బాణసంచా వెలిగిస్తూ గ్రామంలో హడావిడి చేసింది. బోర్నగూడెం గ్రామంలో లోవోల్టేజీ సమస్య తీరుస్తూ కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్/ సొసైటీ చైర్‌పర్సన్ శింగిరెడ్డి రామకృష్ణ, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, సచివాలయాల కన్వీనర్ కొంగర మురళీకృష్ణ, సర్పంచ్‌లు దాసరి నాగేశ్వరరావు, సవిరెల చంద్రుడు, తొంటా ఆదిరాజు, నాయకులు దాట్ల వెంకటేష్‌రాజు, అడపా కామేష్, శింగిరెడ్డి రవి, అంకం రవి, బర్లికల రమణ, తోలాటి దుర్గాప్రసాద్, అడ్డాల రాంబాబు, సలాది సుబ్బారావు, తుప్పల వెంకట్రావు, నక్కా గోవింద్, ఏపీఈపీడీసీఎల్ జేఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బోర్నగూడెంలో ప్రజలతో మాట్లాతున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రేపు ఎమ్మెల్యే పర్యటన ..గంగవరం: మండలంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సోమవారం పర్యటించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి పంద్రప్రోలు పంచాయతీ నీలవరం, పోతందొరపాలెం, పంద్రప్రోలు గ్రామాల్లో చేపట్టే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు.

బోగస్ రేషన్ కార్డుల ఏరివేతపై దుష్ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కూనవరం: బోగస్ రేషన్ కార్డుల ఏరివేతలో అధికార పార్టీ జోక్యం ఉందని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలను వైఎస్సార్‌సీపీ మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఏ ఒక్కా రేషన్ కార్డు తొలగించాలని తమ పార్టీ ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేసింది. పార్టీ మండల కార్యదర్శి పునుగుపాటి భరతమూర్తి ఇంటి వద్ద శనివారం కార్యకర్తల సమావేశంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, మండల జేసీఎస్ ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు ముంపుతో సర్వం కోల్పోతున్న నిర్వాసితుల్లో చిట్టచివరి లబ్ధిదారుకు సైతం న్యాయం చేయాలన్నదే వైఎస్సార్‌సీపీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మేరుకులం, ఆరెకటిక కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు దీకొండ గంగాధర్, అరవా వెంకట్రామారావు, ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు నోముల కొండలరావు, గుజ్జాబాబు, ఎలిపె రమేష్, కొమ్మాని సునీత, గడేసుల ప్రేమ్, కొమ్మాని వీర్రాజు పాల్గొన్నారు.

శరవేగంగా నాడు - నేడు పనులు



శ్లాబ్ పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సునంద

అనంతగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.60 లక్షలతో చేపట్టిన నాడు - నేడు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రూ.17 లక్షలతో విద్యార్థుల సౌకర్యార్థం నిర్మాణం చేపట్టిన మరుగుదొడ్లుకు శ్లాబ్ వేశారు. ఈ పనులను ప్రిన్సిపాల్ సునంద, సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ సంధ్య శనివారం పరిశీలించారు. నాడు - నేడు పథకంతో కళాశాల అభివృద్ధి బాటలో ముందుకు సాగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ 'సంక్షేమం' ఘనత జగన్‌దే..



కండ్రుంలో కార్యక్రమం నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీ ఆనందరావు, పార్టీ శ్రేణులు



వై.రామవరం: మడుగుకోటలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

వై.రామవరం: ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి తెలిపారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రామ సచివాలయం పరిధి మడుగు కోట గ్రామంలో గృహ సారథులు, కన్వీనర్లతో కలిసి వారు శనివారం ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను తెలియజేశారు. గత టీడీపీ ప్రభుత్వం చేసిన మోసాలను వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి, వైఎస్సార్‌సీపీకే మద్దతు ఇవ్వాలని కోరారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుమారు 65 ఇళ్లకు జగనన్న స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, కన్వీనర్లు, గృహసారథులు కరణం కనకరాజు, వి. చిన్నయ్య, ఎం. నారాయణరావు, వి. చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా కండ్రుం పంచాయతీలో వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు శనివారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాన కల్పిస్తూ ప్రతి ఇంటికి స్టిక్కర్లు అంటించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయలేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. పార్టీ నాయకులు వినోద్, దాసు, గోపి, కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు వివరిస్తున్న కన్వీనర్ సంపత్‌కుమార్

అరకులోయ రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మండల కన్వీనర్ పట్టాసీ సంపత్‌కుమార్ తెలిపారు. జగనన్నే మా భవిషత్తు కార్యక్రమంలో భాగంగా బస్కి పంచాయతీ బొండగూడలో శనివారం ఆయన వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, పార్టీ శ్రేణులతో ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరించారు. వీటిని ప్రజలకు అందించేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు నర్సింగ్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉత్సవాల నిర్వహణకు చర్యలు



ఉత్సవ కమిటీతో మాట్లాడుతున్న సీఐ, ఎస్‌ఐలు

కొయ్యూరు: ఎర్రగొండమ్మ తల్లి ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు కొయ్యూరు సీఐ స్వామినాయుడు తెలిపారు. ఎస్‌ఐ రాజారావు అధ్యక్షతన శనివారం శరభన్నపాలెంలో ఉత్సవ కమిటీతో సీఐ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వివాదాలు లేకుండా చూస్తామన్నారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు ఉత్సవాలను నిర్వహిస్తారు. కమిటీ చైర్మన్ మహేశ్, నేను సైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్, సర్పంచ్ కిముడు సత్యనారాయణ పాల్గొన్నారు.

నిరుపేద చంటి బిడ్డకు పాల డబ్బాల అందజేత



పాలు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధి నారాయణ

డుంబ్రిగుడ: నిరుపేద చంటి బిడ్డకు ప్రతి నెలా ఉచితంగా పాల డబ్బాలు అందించేందుకు యూనిటీ ఫర్ చారిటీ ట్రస్టు ముందుకొచ్చింది. గుంటసీమ పంచాయతీ సరియావలసలో తల్లి చనిపోవడంతో పాలకు దూరమైన నెల రోజుల చంటిబిడ్డకు గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర ఆధ్వర్యంలో శనివారం ఆ సంస్థ ప్రతినిధి నీలి నారాయణ పాలు డబ్బాలు అందజేశారు. కార్యక్రమంలో నీలి మేరీజోస్ఫిన్, గిరిజన సంఘం నాయకులు సూర్యనారాయణ, తిలక్ పాల్గొన్నారు.

జర్రెల రోడ్డు పనులకు సహకరించండి



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

గూడెంకొత్తవీధి: కొత్తపాలెం నుంచి జర్రెల వరకు చేపట్టిన రహదారి నిర్మాణానికి వాహనచోదకులు సహకరించాలని జర్రెల, వంచుల, మొండిగెడ్డ పంచాయతీ సర్పంచ్‌లు నాగరాజు, కాసులమ్మ, ప్రియాంక కోరారు. అటవీశాఖల ఆంక్షల కారణంగా ఆగిపోయిన ఘాట్‌రోడ్డు నిర్మాణానికి ఇటీవలే ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. దీంతో ఘాట్‌రోడ్డులో సీసీరోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కొత్తపాలెం నుంచి జర్రెల వరకు ఈ పనులు చేస్తున్నారు. ఈ రహదారి పూర్తయ్యేంత వరకూ వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్టు వారు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామస్తుల సహకారంతో కొత్తపాలెం కూడలిలో ప్రత్యేకంగా కర్రలు అడ్డుపెట్టి తాత్కాలిక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు.

సచివాలయ ఉద్యోగుల మండల కమిటీ ఎన్నిక



ఎన్నికలో పాల్గొన్న ఉద్యోగులు

గంగవరం: గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ మండల శాఖ ఎన్నికలు కొత్తాడ గ్రామంలో శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికల నిర్వహణకు గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సోముల కిశోర్ కుమార్, కార్యదర్శి సిహెచ్.రమేష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌దొర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షుడిగా చవలం బాలుదొర, ఉపాధ్యక్షుడిగా మడకం దొరబాబుదొర, ప్రధాన కార్యదర్శిగా శివగణేష్ దొర, మరో 12 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రోడ్డు నిర్మాణానికి డీఎఫ్‌వో సర్వే



వై.రామవరం నుంచి పిల్లల పుట్ట గ్రామం వరకు సర్వే చేస్తున్న డీఎఫ్‌వో నరేంద్రన్ బృందం

వై.రామవరం: మండల కేంద్రం నుంచి మఠంభీమవరం మీదుగా గుర్తేడు రోడ్డు నిర్మాణం కోసం అటవీశాఖ జిల్లా అధికారి (డీఎఫ్‌వో) జీజీ నరేంద్రన్ శనివారం సర్వే నిర్వహించారు. అటవీశాఖ అభ్యంతరాలతో వై.రామవరం నుంచి పిల్లలపుట్ట గ్రామం వరకు 13 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ అనంతబాబు, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి విశేష కృషి చేయగా, రెండు నెలల క్రితం అటవీశాఖ అధికారుల నుంచి స్టేజ్ –1 పర్మిషన్ లభించింది. ఇంకా స్టేజ్ –2 పర్మిషన్ లభించాల్సి ఉంది. ఈ పర్మిషన్ రావాలంటే ఆ రోడ్డులో అటవీ శాఖ భూమికి, చెట్లకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. ఇందులో భాగంగా నష్టపరిహారం అంచనా వేయడానికి డీఎఫ్‌వో ఆధ్వర్యంలో అటవీ శాఖాధికారుల బృందం వై.రామవరం నుంచి పిల్లలపుట్ట గ్రామం వరకు సర్వే నిర్వహించింది. ఈ నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని డీఎఫ్‌వో తెలిపారు. అడ్డతీగల రేంజి అధికారి డి. లలితకుమారి, వై.రామవరం డిప్యూటీ రేంజి అధికారి సీహెచ్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



కృష్ణ (ఫైల్)

మోతుగుడెం: స్థానిక జగదాంబ సెంటర్ వద్ద చలపాక కృష్ణ(35) మనస్తాపంతో శనివారం ఉరేసుకుని మృతి చెందాడు. అతడు ఉన్నత చదువులు చదువుకున్నప్పటికీ తగిన ఉద్యోగం రాకపోవడం, తల్లిదండ్రులపైనే ఆధారపడి జీవించాల్సి వస్తుందని మధనపడుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో ఉదయం తన స్వగృహంలోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీనివాసునికి సహస్రనామార్చన



శ్రీనివాసునికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహిస్తున్న భక్తులు

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంపై కొలువైన శ్రీనివాసునికి శనివారం సహస్రనామార్చన గావించారు. లంకా అయ్యప్పశర్మ పౌరోహిత్యంలో పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఉదయాన్నే పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తుల నడుమ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. మాలయ్యపాకలకు చెందిన గిరిజనులతో నూతన నామకరణం చేసి నక్షత్ర శాంతి యజ్ఞం నిర్వహించారు. వివాహ దోష నివారణకు క్షేత్రంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకం గావించి అష్టోత్తర పూజను నీరాజన మంత్ర పుష్పాలతో నిర్వహించారు.

వృక్షశాస్త్రంలో గిరిజనుడికి ఏయూ డాక్టరేట్



ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి నుంచి డాక్టరేట్ పట్టా అందుకుంటున్న మురళీకృష్ణ

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ పంచాయతీ కిలగాడ గ్రామానికి చెందిన చెండా బొంజన్న, చెండా సుమిత్రల కుమారుడు మురళీకృష్ణ వృక్షశాస్త్ర విభాగంలో ఏయూ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో అడవులపై చేసిన పరిశోధన పత్రాలను జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించారు. ఆచార్య ఎస్.బి.పడాల్ పర్యవేక్షణలో వృక్షాలు, తీగజాతులపై పరిశోధన చేశాడు. దీంతో పాటు హిమాలయాల పర్వత ప్రాంతాల్లో పెరిగే గుగ్గిలం చెట్లు శ్రీకాకుళం జిల్లా సీతంపేట, దోన్‌బాయి పరిసర ప్రాంతాల్లో గుర్తించాడు. వీటికిగాను డాక్టరేట్ వరించింది. ఈ మేరకు ఏయూ ఉప కులపతి పి.వి.జి.డి ప్రసాద్‌రెడ్డి నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. ఏయూ వృక్షశాస్త్ర విభాగ ఆచార్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

చోరీలపై అప్రమత్తతకు గ్రామాల్లో ప్రచారం

యలమంచిలి : దొంగతనాలపై అప్రమత్తత కలిగి ఉండాలని రూరల్ ఎస్‌ఐ కె.సన్నిబాబు అన్నారు. ఇటీవల కాలంలో చోరీలు అధికమవడంతో శనివారం యలమంచిలి మండలంలోని పలు గ్రామాల్లో దొంగతనాలపై మైక్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాల్లో ప్రజలు ఆరుబయట పడుకోవడం ఆనవాయితీ అని, కానీ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో తలుపులు గడియలు వేసుకోవాలని, దూరపు ప్రయాణాలకు వెళితే స్థానిక పోలీసులకు సమాచారం అందివ్వాలని కోరారు. రాత్రిపూట గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు,అనుమానితులు,సంచరిస్తే తక్షణమే తమకు సమాచారం చేరవేయాలన్నారు. ఇంట్లోని విలువైన వస్తువులు బ్యాంకుల్లో భద్రపరచుకోవాలని, రాత్రి పూట ఒంటరిగా బయటకు వెళ్లకూడదని, యలమంచిలి రూరల్‌లో కొన్ని గ్రామాలు జాతీయ రహదారికి దగ్గరగా ఉన్నాయని, అందువల్ల రాత్రి పూట ప్రత్యేక నిఘా పెడుతున్నామని తెలిపారు. చోరీల నియంత్రణలో భాగంగా పోలీసులకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు



ట్రాన్స్‌ఫార్మర్‌ను మోసుకొస్తున్న తీసుకువెళ్తున్న మూలపట్టం గిరిజనులు

అనంతగిరి: పైనంపాడు పంచాయతీ మూలపట్టం గ్రామంలోని గత కొద్దిరోజులు క్రితం వర్షాలకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో గ్రామానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. శనివారం విద్యుత్‌శాఖ ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులే సుమారు మూడు కిలోమీటర్ల మేర ట్రాన్స్‌ఫార్మర్‌ను మోసుకుంటూ గ్రామానికి తీసుకువెళ్లారు. రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల , అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. అధికారులు స్పందించి, గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు.